## క్లుప్తంగా

### పండ్లు, చీరల పంపిణీ



**జనగామ:** మహిళా కాంగ్రెస్ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పార్వతమ్మ పట్టణంలో వేద ఆయుర్వేద పంచకర్మ వెల్‌నెస్ ఆస్పత్రిలోని పేషేంట్లు, సిబ్బందికి పండ్లు, చీరలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సయాటికా సమస్య వల్ల తాను చాలా రోజులుగా ఇబ్బందిపడుతున్నానని, డాక్టర్ అంజిరెడ్డి చికిత్స అందించి 20 రోజుల్లో సమస్యను తగ్గించారని అన్నారు.

### ఆలయానికి పూజా సామగ్రి అందజేత



**చిల్పూరు:** పల్లగుట్ట గ్రామంలోని శివాలయానికి గ్రామానికి చెందిన కూరోజు నారాయణ జ్ఞాపకార్థం రూ. 10 వేల విలువైన పూజసామగ్రిని ఆదివారం అందజేశారు. ఉదయం అర్చకుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం చిల్పూరుగుట్ట ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు సమక్షంలో శ్యాంసుందర్‌రెడ్డికి నారాయణ కుమారులు రాజన్న, నాగాంజనేయులు.. హారతిపల్లెం, గంట, 5 కళశాలు, శఠగోపం, ప్రమిదలు తదితర సామగ్రి అందజేశారు.

### ‘నీ చరిత్ర చూసుకుని మాట్లాడు రాజయ్య’



**రఘునాథపల్లి :** నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా పేరున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే ముందు నీ చరిత్ర ఏందో తెలుసుకుని మాట్లాడాలని బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే రాజయ్యను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకులు బొల్లం అజయ్, కొయ్యడ ప్రభాకర్, గాదె మహేందర్, బాషుమియాలు మాట్లాడారు.

### ఆర్థికసాయం

**బచ్చన్నపేట:** మండలకేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కర్రె నరేష్ అనారోగ్యంతో బాధపడుతూ సిద్దిపేటలోని ఆర్‌వీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, మండలంలోని పడమటికేశ్వాపూర్ మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్ ఆదివారం నరేష్‌ను పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

**హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో..**



**చిల్పూరు:** మల్కాపూర్ గ్రామానికి చెందిన తౌటి శశిరేఖ అనే వృద్ధురాలికి గ్రామ హెల్పింగ్ హ్యాండ్స్, సాంఘిక సేవా సంస్థ నిర్వాహకులు నా ఆలోచన-రైతు నేస్తం కేశిరెడ్డి రాజేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ నెల ఒక పేదవారిని గుర్తించి ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు.

### హామీలు నెరవేర్చాలి

**తొర్రూరు:** సమగ్ర శిక్షా ఉద్యోగులకు సీఎం ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెల్తూరి మల్లేశం అన్నారు. ఈ మేరకు డివిజన్ కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మల్లేశం మాట్లాడుతూ 2023లో హనుమకొండలో సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన ధర్నాలో పీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి పాల్గొని అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చారన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు ప్రమాద బీమా, హెల్త్ కార్డులు అందించాలని, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వంటివి చెల్లించాలని కోరారు. సీఆర్‌పీలు కల్పన, వీణ, రాధిక, భాస్కర్, రమేశ్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ అసమర్థత వల్లే యూరియా కొరత

**తొర్రూరు:** యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతే కారణమని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేశ్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆదివారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తోందన్నారు. శంకర్, శ్రీమాన్, రవిబాబు, సత్యనారాయణ, రాజు, సంతోష్, సందీప్‌లు పాల్గొన్నారు.

# కంకర రోడ్డుతో కష్టాలు

- ఐటీడీఏ నుంచి రూ.2.5 కోట్లు మంజూరు
- రెండేళ్లుగా దుబ్బతండా వాసుల ఎదురుచూపు

**దేవరుప్పుల:** గత ప్రభుత్వం హయాంలో మారుమూల గిరిజన పల్లెలలకు రవాణా సౌకర్యాలు కల్పన ధ్యేయంగా ప్రారంభించిన అసంపూర్తి రోడ్డు పనులను పట్టించుకునే నాథులు లేకపోవడంతో కంకర వేసిన రోడ్డుపై కాలినడక గిరిజన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల కేంద్రీకృతంగా వ్యవసాయ రంగపురోగతి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు వేదికలు ఏర్పర్చింది విదితమే. ఈ మేరకు కడవెండికి ఇదే రెవెన్యూ పరిధి పొట్టిగుట్టతండా గ్రామ పంచాయతీ పరిధి దుబ్బతండాతోపాటు ధర్మాపురం రెవెన్యూ పరిధి లకావత్‌తండా, పడమటితండా, సీత్యాతండా, లక్ష్మణ్‌తండా రైతులు నిత్యం రైతు వేదికకు రావాల్సి ఉంటుంది. దీంతో కడవెండి మాలవాగు నుంచి దుబ్బతండాకు బీటీ రోడ్డు ఆవశ్యకతను



అధ్వానంగా ఉన్న కడవెండి మాలవాగు నుంచి దుబ్బతండాకు వెళ్లే బీటీ రోడ్డు

గుర్తించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మూడేళ్ల కిందట రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. అనతి కాలంలోనే సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఏటూరునాగారం శాఖ ఆధ్వర్యంలో రోడ్లు మౌలిక సదుపాయాల కింద మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డుకుగానూ రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. కాగా, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సదరు కాంట్రాక్టర్ కంకరపోసే వరకూ యుద్ధప్రాతిపదికన సుమారు రూ.కోటి మేరకు పూర్తి చేశారు. పనులు కాస్త వేగవంతమయ్యేనాటికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన క్రమంలో నయా పైసా బిల్లులు రాకపోవడంతో ఆ కాంట్రాక్టర్ ఇటువైపు చూసిన దాఖలాలు లేకపోగా నాటినుంచి నేటి వరకూ ఆ రోడ్డు అసంపూర్తి పనుల పురోగతిపై పాలకవర్గాలు పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



బోర్డుకే పరిమితమైన బీటీ రోడ్డు

### రోడ్డు ఎయ్యక ముందు నయం ఉండే



మూడేళ్ల నుంచి రోడ్డు ఎస్తమని కంకర పోసిపై పనులు చేసిన పాపాన పోలేదు. కంకరక ఎయ్యక ముందు మట్టిరోడ్డుపై మంచిగా నడిచిపోయేటోళ్లం. ఇప్పుడు నడిచిపోయినా కష్టముంది. సైకిల్ మీద వచ్చినా కొస్సెళ్ల పోయే గ్యారంటీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఇక్కడి ఎమ్మెల్యే పట్టించుకుని మిగితా రోడ్డు పనులు చేయించాలి.

– అజ్మీరా దేవానాయక్, దుబ్బతండా

### రోజువారీ పనులకెళ్లాలంటే కష్టం



మంజూరు చేసిన పనులు సకాలంలో పూర్తి చేస్తే తండా వాసులతోపాటు గ్రామస్తులకు సౌకర్యంగా ఉండేది. కాంట్రాక్టర్ మొదట్లో టకటకా పనుల చేసి సగంలో వదిలేసిండు. మాకు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాలంటే ట్రాక్టర్లు, మోటారు సైకిల్‌కు పంపుచార్లు, వ్యవసాయానికి ఎడ్లతో పాటు మేము నడవలేకపోతున్నాం. తొందరగా రోడ్డు వేయాలి.

– వంగాల మల్లేష్, రైతు, కడవెండి

### నవంబర్ వరకు బీటీ పోసేందుకు చర్యలు

కడవెండి నుంచి దుబ్బతండా రోడ్డు పనులకు సంబంధించి చేసిన పనులకు బిల్లులు చేసి పంపాం. పెండింగ్ బిల్లు రావాల్సి ఉన్న విషయం వాస్తవమే. ఐనప్పటికీ ప్రజల సౌకర్యార్థం నిర్దిష్ట సమయానికి కాంట్రాక్టు అగ్రిమెంటు మేరకు నవంబర్ మాసం నాటికీ బీటీ రోడ్డు పనులు చేసేలా శాఖపరంగా చర్యలు చేపడుతాం.

– వి.పుల్లయ్య, ఐటీడీఏ ఇంజనీర్

## కమ్యూనిస్టులే సాయుధ పోరాట వారసులు



జనగామ రూరల్: జీపుజాతను ప్రారంభిస్తున్న కనకారెడ్డి



రఘునాథపల్లి: నినాదాలు చేస్తున్న నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

**జనగామ రూరల్:** తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వడ్లకొండ గ్రామంలో మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాలను జయప్రదం చేయాలని జీపుజాతను కనకారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు కార్యక్రమంలో మండల కార్యదర్శి బోడ నరేందర్, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, అజారుద్దీన్ సురేశ్ పాల్గొన్నారు.

**17న బహిరంగ సభ..**

**స్టేషన్‌ఘన్‌పూర్:** సాయుధ పోరాట వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీపీఎం బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. తాటికొండ గ్రామానికి చెందిన అక్కినపెల్లి తిరుపతయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి కనకారెడ్డి నివాళులు అర్పించారు.

**చిన్న రాములు ఆశయాలను కొనసాగిస్తాం**

**జఫర్‌గఢ్:** మొగులుగాని చిన్న రాములు ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు పేర్కొన్నారు. మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకులు చిన్న రాములు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆయన స్మారక స్థూపాన్ని సీపీఎం నాయకులు మోకు కనకారెడ్డి, రాపర్తి రాజు ఆవిష్కరించారు.

**విజయవంతం చేయాలి**

**రఘునాథపల్లి:** ఈనెల 17న జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని కుర్చపల్లి గ్రామంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్య క్రమంలో వెంకటేశ్వర్లు, మల్లేష్, పుల్లయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### తాటి సమ్మయ్య జీవితం స్ఫూర్తిదాయకం



**జనగామ రూరల్:** స్వాతంత్ర్య సమరయోధుడు తాటి సమ్మయ్య జీవితం స్ఫూర్తిదాయకమని డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గుండ్లగడ్డలో సమ్మయ్య యాది సభలో డీసీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం డీసీపీ మాట్లాడారు. ఆయన వెంట సీఐ దామోదర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### నియామకం



మహేశ్

**జఫర్‌గఢ్:** మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన బైరపాక మహేశ్‌ను ఆల్ ఇండియా రిపోర్టర్ అసోసియేషన్ (ఐఆర్‌ఏ) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌చంద్ర ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌చంద్ర, జాతీయ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించడంతో పాటు సంఘం పరంగా అండగా నిలువనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### నేడు చిల్పూరు ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు

**చిల్పూరు:** బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు(సోమవారం) శ్రీకృష్ణ తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు స్వామివారిని శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనం కల్పిస్తామని, సాయంత్రం 6 గంటలకు ఊయల సేవ, విష్ణుసహస్రనామ పారాయణం, ద్వాదశారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## పత్తిలో చీడపీడలు.. పరేషాన్‌లో రైతులు



లద్దె, గోధుమ రంగు పురుగు



పురుగుల మందుల కొనుగోలు బిల్లు

**నర్మెట:** ఆరుగాలం శ్రమించి రైతులు సాగు చేసిన పత్తి చేనుకు చీడ పీడలు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తు వర్షాలకు పత్తి సాగు చేసినా, వరుణుడు ముఖం చాటేయడంతో రెండో సారి విత్తడం రైతులపై అదనపు భారం పడింది. మండలంలో 7,125 ఎకరాఓల రైతులు పత్తి సాగు చేయగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి చేనుకు లద్దెపురుగు, గోధుమ రంగు పురుగుల ఉధృతి అధికం కావడంతో పూత, కాత నిలవడంలేదు. దీంతో రైతులు ఫర్టిలైజర్ షాపుల యజమానులను ఆశ్రయించడంతో చీడపీడలు నశించక పోగా వ్యయం మరింత పెరిగి మూలిగే నక్కమీద తాటిపండు పడిన చందంగా మారింది. అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనలతో సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### చేనంతా పురుగే..



మూడెకరాల్లో పత్తి సాగు చేశాను.. లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టా. వానలు బాగా కురువడంతో పురుగు బాగా పుట్టింది. పూత, కాత నిలువడంలేదు. స్థానికంగా ఉన్న ఎరువుల దుకాణం నుంచి మందులు తెచ్చి కొట్టాను. పెసలు ఖర్చు అయనాయి గాని పురుగు చావలేదు. తెల్ల బంగారం కళ్ల చూస్తామనే ఆశలేదు.

– సంగి గట్టయ్య, రైతు, నర్మెట

### వర్షాలు అధికం కావడంతో పురుగుల ఉధృతి పెరిగింది



అధిక వర్షపాతంతో పత్తిలో చీడ పీడల ఉధృతి పెరిగింది. రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. క్లోరి ఫైరిఫాస్ లీటరు నీటిలో 2.2 ఎంఎల్, ఎకరాకు 20 పంపులు, లేదా క్లోరాంట్రనిలిప్రోల్ లీటరు నీటిలో 4 ఎంఎల్, ఎకరాకు 10 పంపులు, ప్రొఫెనోఫాస్ లీటరు నీటికి 3 ఎంఎల్ ఎకరాకు 8 పంపులు వారంలో రెండు మార్లు పిచికారి చేయాలి. అధిక మోతాదులో పురుగుల మందులు, యూరియా వాడకం సైతం చీడపీడల ఉధృతికి దారితీస్తుంది.

– సుంకరి జగదీశ్, ఏఈఓ

### శతాధిక వృద్ధుడి మృతి



మల్లయ్య(ఫైల్)

**రఘునాథపల్లి:** మండలంలోని లక్ష్మీతండా శివారు రామచంద్ర గూడేనికి చెందిన యామంకి మల్లయ్య (104) శతాధిక వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. 1921లో జన్మించిన ఇతను మృతి చెందే వరకు ఆరోగ్యంగా ఉండడం విశేషం.

## నాసిరకంగా మరమ్మతులు

**లింగాలఘణపురం:** మండలంలోని బండ్లగూడెం-జీడికల్ రోడ్డులో ఇటీవల చేసిన రోడ్డు మరమ్మతు పనులు మూన్నాళ్ల ముచ్చటగానే ఉన్నాయి. 2024-2025 సంవత్సరంలో ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్ (ఎఫ్‌డీఆర్) ఫండ్స్ రూ.1.15 లక్షలు మంజూరయ్యాయి. వీటితో ఎనిమిది చోట్ల మరమ్మతుకు గురైన బీటీ రోడ్డుపై ప్యాచ్ వర్క్‌లు చేపట్టారు. ఈ పనులను ఇటీవల మార్చి, ఏప్రిల్‌లో పూర్తి చేశారు. అందులో భాగంగా బండ్లగూడెం సమీపంలో ఓ కల్వర్టు వద్ద చేసిన నాసరికం ప్యాచ్ వర్క్‌తో నాలుగు నెలలకే మళ్లీ ధ్వంసమై యథావిధిగా తయారైంది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. మరమ్మతులు చేసిన నాలుగు నెలలు కూడ గడవకముందే రోడ్డు మళ్లీ ధ్వంసం కావడం పట్ల పనుల్లో ఎంత నాణ్యత ఉందో తెలుస్తోందని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ శ్రీనివాసును వివరణ కోరగా ఇంకా ఎఫ్‌డీఆర్ ఫండ్స్‌లో కొంత మిగులు ఉందని, ఆ నిధులతో మళ్లీ మరమ్మతులు చేస్తామని తెలిపారు.



ప్రమాదకరంగా మారిన రోడ్డు

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న భవానిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి

**తరిగొప్పుల:** సుభిక్ష అగ్రి ఫౌండేషన్ సహకారంతో మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన స్నేహిత ఫుడ్స్ ఆహార ఉత్పత్తుల యూనిట్‌ను తెలంగాణ వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవానిరెడ్డి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, వారు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మండలకేంద్రానికి చెందిన ముగ్గురు రైతు కుటుంబాల ఒంటరి మహిళలు కలిసి స్నేహిత ఫుడ్స్ ఆహార ఉత్పత్తుల యూనిట్‌ను నెలకొల్పడం అభినందనీయమన్నారు. సహజంగా స్థానికంగా లభించే ముడి సరకులతో మసాలాలు, పచ్చళ్లు, కారంపొడి తదితర వాటిని తయారుచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుభిక్ష అగ్రి ఫౌండేషన్ డైరెక్టర్ గరిడి నరేందర్, ఫౌండేషన్ సభ్యులు సాగరిక, వగలబోయిన యాదగిరి, అర్జుల సుధాకర్‌రెడ్డి, కనుకయ్య, శివకుమార్, లూకా, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రాజయ్య దిష్టిబొమ్మ దహనం

**స్టేషన్‌ఘన్‌పూర్:** స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఇటీవల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ తాటికొండ రాజయ్య చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా డివిజన్ కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ రాజయ్య దిష్టిబొమ్మతో కాంగ్రెస్ నాయకులు ఆదివారం శవయాత్ర నిర్వహించారు. రాజయ్య దిష్టిబొమ్మపై రాసలీలల రాజయ్య అని స్టిక్కర్ వేయడంతో పాటు చెప్పుల దండలు, రాజయ్యకు శ్రద్ధాంజలి అంటూ ఫ్లెక్సీ తయారు చేసి శవయాత్ర నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీ నుంచి డప్పు చప్పుళ్లతో గాంధీ చౌరస్తా మీదుగా శివాజీ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో రాజయ్యకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. అనంతరం రాజయ్య దిష్టిబొమ్మను, ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా మాట్లాడుతూ రాజయ్యపై మండిపడ్డారు. ఇటీవల రాజయ్య తరచుగా కడియంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని, పదేళ్ల ఎమ్మెల్యేగా ఉండి ఏమి చేయలేని రాజయ్య అభివృద్ధి ప్రదాత కడియంపై విపరీత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. తప్పుడు ఆరోపణలు చేయడం తగదని, తస్మాత్ జాగ్రత్త కాంగ్రెస్ శ్రేణులు తలుచుకుంటే నిన్ను గ్రామాల్లో తిరగనివ్వమని రాజయ్యను ఘాటుగా హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు క్రాంతి, ఏంఎసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అంబటి కిషన్‌రాజ్, రాజేష్‌నాయక్, బూర్ల శంకర్, పోగుల సారంగపాణి, కొలిపాక సతీష్, సింగపురం వెంకటయ్య, నీరటి ప్రభాకర్, గడ్డమీది సురేష్, విజయ్, సందీప్‌రెడ్డి, తోట సత్యం, ఐలపాక శ్రీను, దుంపల పద్మారెడ్డి, మాచర్ల కుమారస్వామి, సరిత, నాగరాజు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యం

- ప్యాచ్ వర్కులు లేక వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

**కొడకండ్ల:** రోడ్డు గుంతలపై ప్యాచ్ వర్కులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కొడకండ్ల-మొండ్రాయి, కొడకండ్ల-వెలిశాల ఆర్‌అండ్‌బీ రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఏర్పడినా కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొడకండ్ల-వెలిశాల రోడ్డులో బ్రిడ్జి, కల్వర్టుల వద్ద రోడ్డు సమాతరం లేక ఎత్తుగా మారడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకొంటూ వాహన చోదకులు గాయపడుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు, బ్రిడ్జి, కల్వర్టుల వద్ద వేసిన తారు లేచిపోయి, గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పుతున్నాయి. అలాగే మొండ్రాయి రోడ్డులో రామవరం శివారులో కల్వర్టు వద్ద రెండు గుంతలు, మొండ్రాయి మూలమలుపు వద్ద రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురై గాయపడుతున్నా కూడా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ప్యాచ్ వర్కులు చేపట్టకుండా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణం జరిగినప్పటి నుంచి ప్యాచ్ వర్కులపై దృష్టి సారించని అధికారులు ప్రాణాలు పోతే కాని స్పందించరా అనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి చొరవ తీసుకొని రోడ్డుపై ప్యాచ్ వర్కులు చేయించి పెద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జి వద్ద సమాంతరం లేని రోడ్డు



మొండ్రాయి మలుపు వద్ద దెబ్బతిన్న రోడ్డు

## గోమాతకు అంత్యక్రియలు

**దేవరుప్పుల:** మృతి చెందిన ఓ గోమాతకు స్థానికులు అంత్యక్రియలు జరిపి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం జనగామ-సూర్యాపేట రహదారిలో గొల్లపల్లి పరిధిలోని పాత వంతెన వద్ద గుర్తు తెలియని వ్యక్తులు మృత్యువాత పడిన గోమాత(ఆవు)ను వదిలేసి వెళ్లారు. పాత వంతెన నుంచి నిత్యం రైతులు వెళ్లే దారిలో మృతి చెందిన ఆవును చూసిన రైతులు దూదిమెట్ల సోమలింగంయాదవ్, వేల్పుల కృష్ణయాదవ్, అశోక్, దయ్యాల వెంకన్న కలిసి జేసీబీ యజమాని మహమ్మద్ మునీర్ సహకారంతో గోమాతను గోతిలో పూడ్చడం పట్ల ఆ ప్రాంత రైతులు అభినందించారు.



గోమాతను అంత్యక్రియలకు తీసుకెళ్తున్న స్థానికులు

## ఆర్‌యూబీ పనులు వెంటనే పూర్తి చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్

**రఘునాథపల్లి:** రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం వల్లే నిడిగొండ రైల్వే ట్రాక్ వద్ద ఆర్‌యూబీ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, తగు చర్యలు తీసుకొని వెంటనే పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్ డిమాండ్ చేశారు. ‘అసంపూర్తిగా ఆర్‌యూబీ, తరుచూ గేట్ క్లోజ్’ అనే శీర్షికన ఈ నెల 14న సాక్షిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన ఆయన ఆదివారం ఆర్‌యూబీ పనులను పరిశీలించారు. ఈ మార్గంలో పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. వారం రోజులుగా గేట్ క్లోజ్ చేయడంతో అత్యవసర పరిస్థితుల్లో ఇక్కడి నుంచి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్కడి నుంచే రమేశ్ రైల్వే అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. తరుచూ గేట్ ఎందుకు క్లోజ్ చేస్తున్నారు..? నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఒకటి, రెండు రోజుల్లో గేటు తెరుస్తామని రైల్వే అధికారులు తెలిపినట్లుగా రమేశ్ తెలిపారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి సతీష్, శివకృష్ణ, బింగి రమేష్, విజయ్, నవీన్‌కుమార్, కొమురెల్లి, విరోజి, అఖిల్, రవి, జనార్ధన్ తదితరులు ఉన్నారు.



స్థానికుల ఇబ్బందులు అడిగి తెలుసుకుంటున్న రమేశ్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ : 9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)